	ఇఫ్తార్ శని॥ (సా॥)	సహర్ ఆది॥ (ఉ॥)
రాయచోటి	6.29	5.07
రాజంపేట	6.27	5.15
పీలేరు	6.28	5.05
మదనపల్లె	6.30	5.08

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

రాయచోటి టౌన్: మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో శనివారం అయినా పాఠశాలల పనిదినాలు తక్కువగా ఉండటం వల్ల తరగతులు నిర్వహించాలని నిర్ణయించామని, అయితే మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఉన్నతాధికారులు ఈ నెల 8 వతేదీ సెలవుగా ప్రకటించారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు.

12న వేలం పాట

కురబలకోట: జిల్లాలో ప్రతిష్టాత్మకమైన మండలంలోని అంగళ్లు టమాటా మార్కెట్, గొర్రెల సంతతో పాటు కూరగాయల సంత గేటు వేలం పాటలు ఈనెల 12న ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతాయి. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, గ్రామ కార్యదర్శి టి. ఉదయ్‌కుమార్ తెలిపారు. టమాటా మార్కెట్, గొర్రెల సంత గేటు వేలం పాటల్లో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.5 లక్షల చొప్పున డిపాజిట్టు చెల్లించాలన్నారు.

నూతన నియామకం



వి.ఎస్.రెడ్డి

మదనపల్లె సిటీ: జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం సమన్వయకర్తగా మదనపల్లెకు చెందిన పేస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.ఎస్.రెడ్డిని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి నియమించారు. వీ.ఎస్.రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వినియోగదారులను చైతన్యపరిచి సంఘటితం చేయడానికి కృషి చేస్తానన్నారు. ప్రణాళికబద్ధంగా కార్యక్రమాలు చేస్తామన్నారు. త్వరలోనే మండల వినియోగదారుల సమాచార కేంద్రాలను అధికారుల సహకారంతో నియమించడానికి కృషి చేస్తానన్నారు.

నేడు, రేపు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు

మదనపల్లె: ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా రెవెన్యూ సంపదలో భాగంగా శని, ఆది సెలవురోజుల్లో రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...రిజిస్ట్రేషన్స్ ఐజీ, డీఐజీ, డీఆర్ ఉత్తర్వుల మేరకు శని, ఆదివారాల్లో హాలిడే రిజిస్ట్రేషన్స్ చేయాలని ఉత్తర్వులు అందాయన్నారు. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శని, ఆది రెండురోజులు అందుబాటులో ఉంటాయని, ప్రజలు రిజిస్ట్రేషన్ సేవలను వినియోగించుకోవాలన్నారు. అయితే ఇందుకోసం అదనంగా రూ.5,000 హాలిడే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రాయచోటి పరిపాలన కేంద్రంగా జిల్లా కొనసాగుతుంది

రాయచోటి టౌన్: రాయచోటి పరిపాలన కేంద్రంగా అన్నమయ్య జిల్లా కొనసాగుతుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శాసన మండలిలో ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదన ఏమైనా ఉందా.. ఉంటే ఎలాంటి ప్రతిపాదనలు ఉన్నాయి.. ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేస్తారనే ప్రశ్నలకు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిచ్చారని చెప్పారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలు ఏమీ లేవని పేర్కొన్నారని తెలిపారు. కాబట్టి రాయచోటి జిల్లా కేంద్రంగానే ఉంటుందని, అందులో ఎలాంటి మార్పులు ఉండవని, వీటిపై వస్తున్న వదంతులు నమ్మొద్దని స్పష్టం చేశారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

రాయచోటి జగదాంబసెంటర్: మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ పొందేందుకు బీసీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10 నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారు రాయచోటిలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం(గిరిజన బాలుర పాఠశాల వెనుక, రాజంపేట రోడ్డు)లో దరఖాస్తులు పొంది అక్కడే సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు రాయచోటిలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

వనిత.. విజేత

మహిళలు సున్నితమైన వారు.కష్టమైన పనులు చేయలేరు...అన్నది ఇంతవరకు ప్రజల్లో ఉన్న నమ్మకం. కానీ ఇటీవలి కాలంలో ఆ అభిప్రాయం చెల్లాచెదురై పోయింది. ఇంటి నుంచి మింటి వరకు అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్నింటా తానై దూసుకుపోతోంది మగువ. అబ్బురపరిచే విజయాలతో అందరి అభినందనలు అందుకుంటోంది వనిత. అనిర్వచనీయ పాత్రలో అంతులేని ఆత్మవిశ్వాసంతో తనకు తానే సాటిగా.. పోటీగా మందుకు సాగుతోంది నేటి మహిళ. భూమిని చీల్చి పంటలు పండించడం నుంచి ఆకాశంలో రివ్వుమని విమానాలు నడపడంలో కూడా ప్రతిభ చూపుతున్నారు. కొలిమి పనులు, ఖాకీ దుస్తుల ఉద్యోగాల నుంచి రైలు పైలెట్లుగా, ఆర్టీసీ కండక్టర్లుగా రాణిస్తున్నారు. కొన్నిచోట్ల తమకు మాత్రమే గల సున్నితత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రత్యేకతలు చాటుకుంటున్నారు. దేంట్లో అయినా తగ్గేదేలా అంటున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

–కడప కల్చరల్

- అన్ని రంగాల్లో అతివల ప్రతిభ
- ప్రతిభామూర్తుల పరిచయాలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఆమె చిత్రం అపురూపం



మంజులారాణి

వైఎస్సార్ జిల్లా చింతపూతాయపల్లె గ్రామానికి చెందిన చల్లగాలి మంజులారాణి కష్టతరమైన భావాలను గీతల్లో పలకించే విలక్షణ చిత్రకారిణి. భర్త గొల్లపల్లి జయన్న రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు పొందిన చిత్ర, శిల్పకారుడు కావడంతో ఆమె తన ప్రతిభకు మెరుగులు దిద్దుకుంది. ప్రత్యేక శైలిగల చిత్రకారిణిగా ఆమె ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉనికిని చాటుకున్నారు. మహిళా సమస్యలను ప్రతిబింబించేలా ప్రతీకాత్మక చిత్రాలను గీయడం మంజులారాణికి రంగులతో పెట్టిన విద్య, మరీ ముఖ్యంగా మాతృత్వం తొణికిసలాడే అమ్మ చిత్రాలు, మురిపాలు ఆస్వాదిస్తూ తన్మయత్వంలో మునిగిన చిన్నారుల చిత్రాలు ఆమె చిత్రాలకు సంతకాలుగా నిలుస్తున్నాయి. ఆమె పలు జాతీయ, అంతర్జాతీయ చిత్ర కళా ప్రదర్శనల్లో పాల్గొని బహుమతులను సాధించారు.యువ చిత్రకారులను ప్రోత్సహిస్తున్నారు.

మేరీ.. సేవా నారీ



అనాథ శవాలకు అంత్య క్రియలు నిర్వహిస్తున్న పాల మేరీ సునీత (ఫైల్)



పాల మేరీ సునీత

కమలాపురం: ప్రస్తుత సమాజంలో రక్త సంబంధీకుల మృతదేహాలను చూసేందుకు జంకుతున్న తరుణంలో నేను సైతం అంటూ అనాథ మృత దేహాలకు అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వస్తున్నారు కమలాపురం పట్టణం, కె. అప్పాయపల్లెకు చెందిన పాల మేరీ సునీత... కరోనా సమయంలో ఎవరైనా మృతి చెందితే సొంత కుటుంబ సభ్యులే చూసేందుకు ముందుకు రాని సందర్భాల్లో సునీత తన భర్త భూపాళం వెంకట లక్ష్మణ్ కుమార్ ప్రోత్సాహంతో అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్ బాబు సహకారంతో మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారు. కరోనా కష్టకాలంలో 8 మంది మహిళల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. విజయ్ బాబు స్థాపించిన ట్రస్ట్‌లో 2021లో సభ్యురాలిగా చేరారు. ఎక్కడైనా అనాథమృతదేహాలు ఉన్నాయనే సమాచారం వస్తే సునీత తన భర్త లక్ష్మణ్, సోదరుడు కరుణాకర్, ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబుతో కలసి అక్కడికి చేరుకుని మృతి చెందిన వారి మతాను సారం అంత్యక్రియలు నిర్వహిస్తూ, మానవత్వం చాటుతూ ముందుకు సాగుతున్నారు. ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఇప్పటి వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మృతి చెందిన 42 మంది పేద, అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఎక్కడైనా అనాథ మృతదేహాలు ఉంటే తమకు సమాచారం ఇస్తే వచ్చి ఉచితంగా అంత్యక్రియలు నిర్వహిస్తామని చెబుతోంది పాల మేరీ సునీత.

ఆటాడించి...అగ్రస్థానంలో నిలిచి



ఎల్.వెంకట లక్ష్మీదేవి

విద్యార్థులకు ఆటపాటలు అక్కర్లేదని, అవి అన్నం పెట్టవని, పైగా చదువు పాడవుతుందని తల్లిదండ్రులు తేలిగ్గా చూస్తున్నారు. ఇలాంటి దశలో క్రీడారంగంలో తనదైన పట్టు సాధించి ఆణిముత్యాల్లాంటి విద్యార్థులను గుర్తించి వారి ప్రతిభను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళుతోంది ఆమె. తాను పనిచేస్తున్న పాఠశాల గౌరవాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపిన డ్యాషింగ్ లేడీ, కడప నగర పాలక సంస్థ (మెయిన్) స్కూలు ఫిజికల్ డైరెక్టర్ ఎల్.వెంకట లక్ష్మిదేవి. 2012లో ఆమె బదిలీపై మున్సిపల్ మెయిన్‌హైస్కూలుకు వచ్చారు. మైదానంలో దిగారు. అంతవరకు స్తబ్దుగా ఉన్న క్రీడాపరికరాలకు చలనం వచ్చింది. ఫలితంగా ఆ స్కూలు రాష్ట్ర స్థాయిలో రెండుసార్లు ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఆ తర్వాత ఏకంగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి కడప పతాకాన్ని రెపరెపలాడించింది. దీంతో మున్సిపల్ హైస్కూలు మెయిన్ పాఠశాలను ప్రజలు క్రీడా పాఠశాలగా వ్యవహరిస్తున్నారు. మా వాడికి ఆటలు వద్దు అంటూ వెనక్కి తీసుకెళ్లిన బాలలను పదో తరగతిలో టాపర్లుగా నిలిపి వాళ్ల అభిప్రాయం తప్పని నిరూపించారు. తన శ్రమతో పలువురు విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో క్రీడా బహుమతులు సాధించేలా చేసింది. ఫిజికల్ డైరెక్టర్‌గా ఎల్.వెంకటలక్ష్మి తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ఇప్పుడామె వైఎస్సార్ జిల్లాలో క్రీడా శిక్షణకు ఐకాన్‌గా నిలిచారు.

సేవా పథంలో పయనం



నెమలిదిన్నె నాగవేణి

కడప నగరానికి చెందిన నెమలిదిన్నె నాగవేణి పరిచయం అవసరం లేని సామాజిక సేవా కార్యకర్తగా గుర్తింపు సాధించుకున్నారు. నిజానికి ఆమె నిరుపేద కుటుంబానికి చెందిన యువతి. అయినా నగర పరిధిలోని అనాథ, వృద్ధులు, మహిళల ఆశ్రమాల్లో దుప్పట్లు, నూతన వస్త్రాలు, అన్నదానాలు చేస్తూ వారి అభిమానాన్ని సాధించుకున్నారు. రక్త సేకరణ శిబిరాలు, గుండె సంబంధిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటారు. దీపావళికి జువైనల్ హోంలోని బాలలందరికీ నూతన వస్త్రాలు, విందు భోజనం అందిస్తారు. వారితో కలిసి టపాసులు కాల్చి ఆనందిస్తారు. అధికారుల చుట్టూ తిరుగుతూ సేవా కార్యక్రమాల్లో వారు కూడా భాగస్వాములు అయ్యేలా చూస్తారు. ప్రైవేటుగా పీజీ చేస్తున్న ఆమె ప్రస్తుతం కడప నగరంలో పర్యాటక శాఖలో చిరుద్యోగిగా సేవలు అందిస్తున్నారు. ఇంతవరకు ఒక్క అన్నం పొట్లం కూడా ఇంటికి తీసుకెళ్లని ఆమెను విశ్వసించిన పలువురు మానవతా వాదులైన దాతలు ఆమె ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తనపై ఉన్న నమ్మకాన్ని చిరకాలం నిలబెట్టుకునేందుకే ప్రయత్నిస్తానని, తనను చూసిన వెంటనే ఆర్తుల ముఖాల్లో కనిపించే వెలుగును చూస్తే తన హృదయం ఆనందంతో నిండిపోతుందనంటారు నాగవేణి. అందుకు ఆమెను జిల్లా స్థాయి అధికారులు సైతం అభిమానిస్తారు.

తండ్రి స్ఫూర్తితో.. ఆయన అడుగుజాడల్లోనే...



పుత్తా పద్మ, వైవీయూ రిజిస్ట్రార్

కడప ఎడ్యుకేషన్: మేము చిన్నతనం నుంచే తండ్రి స్ఫూర్తితో తీసుకుని బాగా చదువుకుని నేడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఎంతో మంది పిల్లలకు సేవలందిస్తున్నామని యోగివేమన విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ పుత్తా పద్మ పేర్కొన్నారు. వివరాలు అమె మాటల్లోనే.. 'నా పేరు పుత్తా పద్మ. చెన్నూరు మండలం చిన్నమాచుపల్లి. తండ్రి నాగముని రెడ్డి, తల్లి సీరజ. మా నాన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్‌గా పనిచేస్తూ చివరిగా కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ పొందారు. ఆయన లెక్చరర్‌గా పని చేస్తూ ఎంతో మంది విద్యార్థులకు బోధనలందించి ప్రయోజకులను చేశారు. ఆయన స్ఫూర్తితో నేను కూడా బాగా చదువుకుని నేడు ఎంతో మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నా. నేను ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి వరకు కడపలోని విద్యామందిర్ స్కూల్లో చదువుకున్నాను. ఇంటర్‌ను అనంతపురంలోని నేషనల్ సాయిబాబా ఎయిడెడ్ కళాశాలలో, డిగ్రీ తిరుపతిలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చదివాను. ఎంఏ, ఎంఫిల్ అనంతపురంలోని ఎస్కే యూనివర్సిటీలో, పీహెచ్‌డీ తిరుపతి మహిళా యూనివర్సిటీలో పూర్తి చేశాను. 1998లో నేను కడపలోని సుబ్బిరెడ్డి ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా చేరాను. 2006లో ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తూ 2007లో కడపలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు బదిలీపై వెళ్లాను.2007 చివరిలో కడప యోగివేమన యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరా. 2013లో ప్రొఫెసర్‌గా అక్కడే పదోన్నతి పొందా. అక్కడ సీనియర్ ఫ్యాకల్టీగా, చీఫ్ ఎగ్జామినర్‌గా, ఉమెన్ కన్వీనర్‌గా, హెచ్ఓడిగా, డీన్‌గా పలు హోదాల్లో పనిచేశా. ప్రస్తుతం ఎస్కే యూనివర్సిటీకి కూడా బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, పులివెందుల జేఎన్‌టీయూకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా పనిచేస్తున్నా.' కోవిడ్‌సమయంలో వైవీయూలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచే సిన ఈమె జిల్లాలోని అన్ని కళాశాలల్లో కట్టుదిట్టంగా పరీక్షలను నిర్వహించి మంచిపేరు తెచ్చుకున్నారు.

క్రీడల్లో రాణిస్తూ..



ట్రోఫీతో జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారిణి రేణుక

తల్లిదండ్రులు ప్రోత్సహిస్తుండటంతో రాజంపేట పట్టణం గంగిరెడ్డిపాలెంకు చెందిన చిత్తూరు రుతిక రేణుక వాలీ బాల్ క్రీడలో సత్తా చాటుతోంది. ఇప్పటి వరకు రుతిక రేణుక ఏడుసార్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ఆయా పోటీల్లో సత్తా చాటింది. ఆమె రాష్ట్ర జట్టుకు వైస్ కెప్టెన్ గా కూడా వ్యవహరిస్తోంది. ఒక సారి ఆల్ ఇండియా గేమ్స్, పీఎం కప్ పోటీలకు ఎంపికైంది. అలాగే మూడు మార్లు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొని రాణించింది. కుటుంబ సభ్యులు ప్రోత్సహిస్తే మహిళలు ఏ రంగంలో అయినా రాణించగలరని రుతిక రేణుక చెబుతోంది.

'అభాగ్యుల పాలిట 'స్వాతి'కిరణం



వృద్ధాశ్రమంలో సేవలు అందిస్తున్న స్వాతి

మదనపల్లె సిటీ: తనకు మాత్రమే ఎందుకు కష్టం వచ్చింది? అని ఆలోచించే బదులు నాలా మరెంత మందికి ఈ కష్టం వచ్చిందో.. వాళ్ల పరిస్థితి ఏమిటి అని ఆలోచించే మనస్తత్వం అతి కొద్ది మందికి మాత్రమే ఉంటుంది. అలాంటి రెండో కోవకు చెందుతుంది డాక్టర్ శంఖారపు స్వాతి. ఉద్యోగ,ఉపాధి కోసం తిరగని చోటంటూ లేదు. దీంతో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనైనా నేడు ఆమె వేలాది మందికి నైపుణ్యాలను అందించి వారికి దారి చూపిస్తోంది. మదనపల్లె పట్టణానికి చెందిన డాక్టర్ స్వాతి తెలుగుభాషలో పీహెచ్‌డీ పూర్తి చేసిన తర్వాత పెద్దలు నిశ్చయించిన వారితో పెళ్లి చేసుకుని బెంగళూరులో అడుగుపెట్టింది. అంతా బాగానే ఉందనుకునే సమయానికి భర్తకు వ్యాపారంలో తీవ్రమైన నష్టాలు వచ్చాయి. దీంతో మరోదారి లేక డిగ్రీ పట్టా చేత పట్టి ఉద్యోగ వేటలో పడిన ఆమెకు ఎక్కడకెళ్లినా నిరాశే ఎదురయ్యేది. దీంతో మదనపల్లె పట్టణానికి చేరుకున్నారు. డబ్బు చెల్లించి కోర్సులు నేర్చుకునే స్తోమత లేక టైలరింగ్,కుట్లు, అల్లికలు, శారీరోలింగ్, ఫ్రాబిక్ పెయింటింగ్,ఎంబ్రాడయిరీ వంటి వాటిని ఆన్‌లైన్ ద్వారా సొంతంగా నేర్చుకుంటూ ప్రతిభను పెంచుకున్నారు.ఆకట్టుకునే డిజైన్లతో వస్త్రాలను కుట్టించేది. వచ్చిన డబ్బుతో బోటిక్, టైలరింగ్ షాపులను ప్రారంభించింది. ఈ క్రమంలోనే ఒంటరి మహిళలు, వితంతువులు,సమాజంలో పడే కష్టాలను గమనించింది. అలాంటి వారికి చేయూత ఇవ్వాలన్న లక్ష్యంతో ధాత్రి ఫౌండేషన్ ప్రారంభించింది. తొమ్మిది మందితో ప్రారంభమై నేడు వెయ్యి మందికిపైగా మహిళలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. రోగులకు, రైతులకు, విద్యార్థులకు, మహిళలకు చేయూతనిచ్చి వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ కల్పించి సూక్ష్మ రుణాల ద్వారా ఉపాధి కల్పించి వారి వికాసానికి తోడ్పతున్నారు.

మూగ జీవాలకు సేవ చేయాలనే లక్ష్యంతో..



డాక్టర్ శారదమ్మ, జిల్లా పశువైద్యాధికారి

కడప అగ్రికల్చర్: మాది వ్యవసాయ కుటుంబం. మా తల్లితండ్రులు కూడా వ్యవసాయంతోపాటు పాడి పశువులను పెంచే వారు. పాడి పశువులపై వారికి ఉన్న ప్రేమ చూసి నేను కూడా బ్యాచలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ పూర్తి చేశా.పశుసంవర్ధకశాఖలో ఉద్యోగాన్ని సంపాదించి వేల మూగజీవాలకు సేవలందిస్తున్నానని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ చెముడూరి శారదమ్మ చెబుతున్నారు. వివరాలు ఆమె మాటల్లో..మాది కలపాడు మండలం కలసపాడు గ్రామం. నేను 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఎగువ రామాపురంలో, 6,7,8 తరగతులను కలసపాడులో, 9, 10 తరగతులు పోరుమామిళ్లలో చదివాను. ఇంటర్‌ను కడపలోని బాలికల జూనియర్ కళాశాలలో, డిగ్రీ తిరుపతిలో పూర్తి చేశా.తర్వాత బ్యాచులర్ ఆఫ్ వెటర్నీరీ సైన్స్ తిరుపతిలో పూర్తి చేశాను.

- 1993లో చాపాడు మండలం వెదురూరులో తొలిసారిగా పశువైద్యాధికారిగా ఉద్యోగంలో చేరా. మూగ జీవాలకు వైద్యసేవలందిస్తూ.. రైతు సంక్షేమం, అభివృద్ధి ద్యేయంగా పనిచేశాను. 2005 అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది జమ్మలమడుగు ప్రాంతంలో పలు మండలాల్లో పనిచేశా. 2014లో డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది కడపకు వచ్చా. ఇక్కడే పనిచేస్తూ 2021లో జిల్లా పశువైద్యాధికారిగా పదోన్నతి పొంది సేవలందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వైద్యులకు సూచనలు, సలహాలను అందిస్తూ రైతు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారు. తల్లితండ్రుల ఆశయాన్ని నేరవేరుస్తున్నందుకు ఆనందంగా ఉందని చెబుతున్నారు డాక్టర్ శారదమ్మ.

ఓటమే విజయానికి నాంది



షేక్ ఆయిషా

మదనపల్లెకు చెందిన ఆయిషా ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించింది. లక్షల్లో జీతం అయినా తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి గ్రూప్-1కు సన్నద్ధమయ్యారు. తొలి ప్రయత్నం విఫలమైనా నిరాశ చెందలేదు. మళ్లీ పట్టుదలతో ప్రయత్నించి గ్రూప్-1 విజేతగా నిలిచింది. సాధారణ కుటుంబంలో పుట్టిన ఆమె అనకాపల్లి ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్నారు. మదనపల్లెకు చెందిన అహ్మద్ బాషా చిరువ్యాపారి. తల్లి సాధారణ గృహిణి. క్యాంపస్ ఇంటర్వ్యూలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినా తాను సివిల్స్ రాయాలని ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో వారి ప్రోత్సాహంతో పోటీ పరీక్షలు రాసి విజేతగా నిలిచారు.

వాటర్ ఉమెన్ పారేశమ్మ



రైతులకు అవగాహన కల్పిస్తున్న పారేశమ్మ (ఫైల్)

బి.కొత్తకోట: నీటి పొదుపు, భూగర్భజలాల వినియోగం, చిరుధ్యానాల సాగుపై గ్రామీణుల్లో చైతన్యం తీసుకొచ్చిన పారేశమ్మ వాటర్ ఉమెన్‌గా నిలిచి అవార్డు అందుకొంది. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెకు చెందిన పారేశమ్మ ఐటీఐ పూర్తి చే సి గుజరాత్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థలో రిసోర్స్ పర్సన్‌గా పనిచేసింది. తంబళ్లపల్లెల్లో ఈమె పంటల సాగు, వనరుల సంరక్షణ, గ్రామస్తులతో సంఘాల ఏర్పాటు చేయడంపై కృషి చేస్తూ రైతుల్లో మార్పు తీసుకొచ్చింది. ఈమె కృషిని అంతర్జాతీయ సంస్థ అయిన యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, కేంద్రప్రభుత్వ పరిధిలోని జాతీయ వాటర్ మిషన్ గుర్తించాయి. 2021లో ఉమెన్ వాటర్ అవార్డుకు 41 మంది ఎంపికవగా అందులో ఏపీ నుంచి పారేశమ్మ ఒకరు. అంతేకాదు..గ్రామీణ ప్రాంతాల్లో స్ఫూర్తిదాయక మహిళలు, మహిళా సంఘాలకు చెందిన మహిళల కథలను వెలుగులోకి తీసుకొస్తుంటుంది.రాష్ట్రపతి ద్రౌపదిముర్ము స్వచ్ఛ సుజల్ శక్తికి అభివ్యక్తి-2023 పేరుతో కేంద్రప్రభుత్వం వెలువరించిన నివేదికలో నీటిసంరక్షణ, చిరుధాన్యాల సాగులో విశేష కృషి చూపిన మహిళల గురించి ప్రస్తావనలో పారేశమ్మకు చోటు దక్కింది. అలాగే హైదరాబాద్‌కు చెందిన సంకల్ప దివస్ సంస్థ రూ.12వేల నగదు, అవార్డుతో సత్కరించింది. తంబళ్లపల్లెలోని 33 పల్లెల్లో పారేశమ్మ రిసోర్స్‌పర్సన్‌గా పనిచేసింది. పంటల సాగు, భూగర్భజలాల మట్టాన్ని అంచనా వేసి పంటలకు ఎంత నీటి వ్యయం అవుతుంది, ఏ పంటలు సాగు చేయాలో రైతుల్లో అవగాహన కల్పించారు.

బాలలు, మహిళల హక్కులే లక్ష్యం



బాలల హక్కుల పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న లలితమ్మ

మదనపల్లె సిటీ: సాయం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు లలితమ్మ. మదనపల్లె పట్టణానికి చెందిన ఈమె లింగవివక్షకు గురైన బాధితురాలే. పెద్ద చదువులకు వెళ్లాలనుకున్నా పదో తరగతిలోనే చదువును ఆపాల్సి వచ్చింది. గాంధీ గ్రామీణాభివృద్ధి సంస్థలో బాల్వాడీ టీచర్‌గా పని చేసేందుకు 1990లో ములకలచెరువు వెళ్లారు 1992 తంబళ్లపల్లె చేరుకుని అక్కడే పీపుల్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(పోర్డు) స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. బాల్యవివాహాలను రూపుమాపడమే కాకుండా బడిమానేసిన వారికి తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ, వాటర్ ఎయిడ్‌ఇండియా, అమెరికాకు చెందిన చైల్డ్ రైట్స్ యు (క్రై) సంస్థలు ఆర్థిక చేయూత ఇవ్వడంతో బాలలు, మహిళల హక్కుల కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు.

బ్యాడ్మింటన్ రాకెట్.. హోత్రిశ్రీ



2023లో పాలిటెక్నిక్ బ్యాడ్మింటన్ పోటీల్లో చాంపియన్‌షిప్ ట్రోపి అందుకుంటున్న హోత్రిశ్రీ (ఫైల్)

పీలేరు: పీలేరు పట్టణానికి చెందిన మాజీ సైనికుడు టి. ప్రభాకర్‌రెడ్డి కుమార్తె టి. హోత్రిశ్రీ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. చిన్నతనం నుంచే బ్యాడింటన్‌పై పట్టు సాధించి అనేక విజయాలు సొంతం చేసుకుంది. తండ్రి ప్రోత్సాహంతో గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు పొందుతోంది. ఆమె తండ్రి ప్రభాకర్‌రెడ్డి జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. తన ఆరవ ఏటలోనే బ్యాడ్మింటన్‌లో అడుగుపెట్టిన హోత్రిశ్రీ 2017లో గోపిచంద్ అకాడమీలో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పతకం గెలుపొందింది. రాజమండ్రిలో అండర్-15 విభాగంలో రాష్ట్ర చాంపియన్‌గా నిలిచింది. 2018లో నెల్లూరులో అండర్-14 విభాగంలో మినీ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా నిలిచింది.2019లో ప్రొద్దుటూరు, బెంగళూరులో సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలను అందుకుంది. 2019లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అబ్దుల్ కలాం పురస్కారాన్ని స్వీకరించింది.2021లో బెంగళూరులో జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచింది.

- 2024 సెప్టెంబరులో కడప జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరచి చెన్నైలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనంది. ప్రస్తుతం కేఎంఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతోంది. అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా రాణించాలన్నదే తన లక్ష్యమని హోత్రిశ్రీ చెబుతోంది.

క్లుప్తంగా

వృద్ధుడు అనుమానాస్పద మృతి


మృతి చెందిన కృష్ణయ్య

పీలేరురూరల్ : అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రేగళ్లలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని రేగళ్ల పంచాయతీ నగిరికి చెందిన డి. కృష్ణయ్య (64) గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో శుక్రవారం మృతదేహం లభ్యమైంది. పీలేరు పట్టణం జర్న లిస్టు కాలనీలో కాపురం ఉంటూ జీవనం సాగిస్తున్న ఆయన గురువారం స్వగ్రామానికి వెళ్లి చౌకదకాణంలో బియ్యం తీసుకెళ్లాడు. అనంతరం ఇంటి నుంచి వెళ్లి కనబడలేదు. శుక్రవారం పొలాల వద్ద కృష్ణయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. గట్టు గ్రామానికి చెందిన అశోక్ భార్య భార్గవి కుటుంబసమస్యలతో ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగ వైద్యులు చికిత్స అందించినా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

తండ్రి, కొడుకులపై దాడి

మదనపల్లె : ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు తండ్రి, కొడుకులపై దాడిచేసిన ఘటన గురువారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని శేష్‌మహల్ సమీపంలో నివసిస్తున్న జాషువా(50) అదే ప్రాంతంలో ఉన్న వెంకటరమణకు స్థలం కొనుగోలు కోసం మూడు సంవత్సరాల క్రితం మూడులక్షల రూపాయలు ఇచ్చాడు. అయితే మూడేళ్లుగా స్థలం ఇప్పించకపోగా, డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో గురువారం రాత్రి జాషువా నగదు తిరిగి ఇవ్వాల్సిందిగా వెంకటరమణను నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి వెంకటరమణ, జాషువాను కొట్టాడు. దీంతో జాషువా తన కుమారుడు భరత్(28), జోసెఫ్(22), మహేష్(20) లకు సమాచారం ఇచ్చి సంఘటనాస్థలానికి పిలిపించాడు. దీంతో వెంకటరమణ సైతం తన మనుష్యులను అక్కడకు రప్పించి జాషువా, అతడి కుమారులపై దాడికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ ఎరీషావలీ తెలిపారు.

సౌమ్యనాథుడి హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. రూ. 1,94,302 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. 24 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు చెప్పారు. మొత్తం డబ్బును ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్ హనుమంతయ్య, టీటీడీ విజిలెన్సు అధికారి రమణారెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి

- 33 యూనిట్లకు రూ. 2.93 కోట్ల మేర రాయితీలు మంజూరు
- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్


పరిశ్రమల ఏర్పాటు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ఆర్థిక ప్రగతికి పరిశ్రమలు దోహదం చేస్తాయని కలెక్టర్ అన్నారు. పరిశ్రమల వల్ల వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించి జిల్లా ఆర్థిక ప్రగతి కూడా మెరుగుపడుతుందన్నారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలని తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలలో ఔత్సాహిక నూతన పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమలశాఖ అధికారులు, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలన్నారు.

33 యూనిట్లకు రాయితీలు :
జిల్లాలో 33 యూనిట్లకు రూ. 2.93 కోట్లు మేర రాయితీలను మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి ప్రోత్సాహక రాయితీ కేంద్రం జిల్లాలో మొత్తం 22 యూనిట్లకు రూ. 2,72,96,776లు పావలా వడ్డీ రాయితీ క్రింద 4 యూనిట్లకు రూ. 4,96,592లు, విద్యుత్ రాయితీ క్రింద 7 యూనిట్లకు రూ. 15,83,583లు మంజూరుకు కమిటీ ద్వారా ఆమోదం తెలియజేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు జి కృష్ణారావు, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి ఆంజనేయులు, డిఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, విద్యుత్ శాఖ డిఈ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి అనీల్ కుమార్, డిక్కీ, టిక్కి జిల్లా ప్రతినిధులు శివశంకర్, రామ్మూర్తి నాయక్, సిక్కి అసోసియేషన్ అధ్యక్షులు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్, కమర్షియల్ ట్యాక్స్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలించి భవిష్యత్తుకు బంగారుబాట వేద్దాం


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

కేవీపల్లె : నాటుసారాను సమూలంగా నిర్మూలించి భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేద్దామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. శుక్రవారం మండలంలోని జిల్లేళ్లమందలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించి నాటు సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సారా తయారు చేసేవారు, తయారీకి సహకరించిన వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. నాటు సారా వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని, భవిష్యత్తు తరాలు నష్టపోతున్నాయని తెలిపారు. నాటుసారాను అరికట్టి ప్రజలందరికీ ఉజ్వల భవిష్యత్తువైపు నడిపించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నాటుసారా తయారు చేయడం ఆపేసిన వారికి ఆర్థికంగా రుణాలు అందించడం, వ్యాపారాలను ప్రారంభించేందుకు సహాయాన్ని అందించడం లాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కువ మొత్తంలో బెల్లం అమ్మి నాటుసారా తయారీకి సహకరిస్తే వారిమీద పీడీ చట్టాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు. నాటు సారా తయారికి ఏ విధమైన సహాయ సహకారాలు అందించినా చర్యలు తప్పవన్నారు. నాటు సారా అమ్మకాలు, రవాణాపై టోల్ ఫ్రీనెంబర్ 14405కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. నాటుసారా నిర్మూలనకు కట్టుబడి ఉంటామని అందరితో కలసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామస్తుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషన్ జయరాజ్, అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 2018లో నవోదయం 1.0 కార్యక్రమాన్ని ఒంగోలులో ప్రారంభించడం జరిగిందన్నారు. మళ్లీ ప్రస్తుతం ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఏఎస్పీ జోగేందర్, సీఐ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, సర్పంచ్‌లు కృష్ణవేణి, అమ్ములు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు

ఆదుకుంటామని ఎంపీ, ఎమ్మెల్యే భరోసా

బి.కొత్తకోట : చెట్టుపైకి ఎక్కిన యువకుడ్ని విద్యుత్ షాక్ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం బి.కొత్తకోట మండలం శంకరాపురం వద్ద జరిగింది. స్థానికులు, బాధితుల కథనం మేరకు వివరాలు. మండలంలోని బడికాయలపల్లి గ్రామం అప్పినాయునిపల్లికి చెందిన రవి స్థానిక ఇందిమ్మకాలనీలో నివాసం ఉంటున్నాడు. రైతుల పొలాల్లో కొత్తిమీర కొనుగోలు చేసి వ్యాపారం చేసుకొంటూ జీవిస్తున్నాడు. బీరంగి గ్రామం కురప్పల్లిలో కొత్తిమీర కొనుగోలు చేయడంతో పొలం నుంచి తీసుకొచ్చేందుకు రవి కుమారుడు పి.శ్రీకాంత్ (24) వెళ్లాడు. కొత్తమీర పొలం నుంచి తీశాక ఆకు కోసం శంకరాపురం వద్ద రోడ్డు పక్కన ఉన్న చెట్టుపైకి శ్రీకాంత్ ఎక్కాడు. చెట్టు మధ్యలోంచి వెళ్తున్న విద్యుత్ సరఫరా తీగలు కనిపించలేదు. కాలికి చెప్పులతోనే పైకి ఎక్కడం తర్వాత షాక్ తగలినా ప్రమాదం బారిన పడలేదు. చెప్పులు జారిపడిపోవడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. చెట్టుపై నుంచి కొమ్మల మధ్యలో పడుతూ కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతను ఫోన్‌లో జరిగిన ఘటనను తండ్రికి చెప్పగా.. కేకలు విన్న ఓ మహిళ శంకరాపురంలోకి వెళ్లి స్థానికులను తీసుకొచ్చింది. గమనించిన స్థానికులు సపర్యలు చేశాక 108 అంబులెన్స్‌లో స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. శ్రీకాంత్ కుడిచేతి మణికట్టు తొలగించాల్సి వస్తుందని, కాలి వేళ్లను తొలగించాలని వైద్యులు చెప్పినట్టు బాధితుడి తండ్రి రవి ఆవేదన వ్యక్తం చేశాడు. నిరుపేదలమైన తాము వైద్యం కూడా చేయించలేని పరిస్థితి ఉందని, ఆదుకోవాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్ ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై బాధితున్ని ఆదుకుంటామని వారు భరోసా ఇచ్చారని ఖలీల్ తెలిపారు.


తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్

బ్రెడ్డు తిని ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత


స్థానికులు, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కొండయ్య

తంబళ్లపల్లె : మండలంలోని కోటకొండ యూపీ పాఠశాలలో ఆరవ తరగతికి చెందిన ఐదుగురు విద్యార్థులు శుక్రవారం ఓ దుకాణంలో బ్రెడ్డు కొని తినడంతో అస్వస్థతకు గురయ్యారు. వైద్యాధికారుల కథనం మేరకు వివరాలు.. కోటకొండ యూపీ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థులు అరవింద్ (11), జగదీష్ (11) బన్నీ (12), సంధ్య(12), అశ్విని(11) పాఠశాల బయట దుకాణంలో బ్రెడ్డు కొని తిన్నారు. కొద్దిసేపటికి అస్వస్థకు గురై వాంతులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం లలితమ్మ, ఉపాధ్యాయులు పిల్లలను ఆరోగ్య ఉప కేంద్రానికి తీసుకెళ్లారు. ఎఎన్ఎం గంగులమ్మ, ఆశా కార్యకర్త నారాయణలు విషయాన్ని కోసువారిపల్లె మెడికల్ ఆఫీసర్ అనుపమకు తెలియజేశారు. వైద్యాధికారి మునికుమార్, ఎంఈఓ త్యాగరాజు కోటకొండకు పరుగులు తీశారు. విషయాన్ని వైద్యాధికారి అనుపమ డీఎంహెచ్ఓ కొండయ్యకు తెలియజేశారు. డిఎంహెచ్ఓ పాఠశాలకు చేరుకుని అస్వస్థతకు గురైన పిల్లలతో మాట్లాడారు. బయట తినుబండారాలు తినకూడదని సూచించారు. చికిత్స తరువాత విద్యార్థులు కోలుకున్నారు.

ముత్యపు పందిరి వాహనంపై శ్రీలక్ష్మీనరసింహుడు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ముత్యపు పందిరి వాహనంపై ఘనంగా ఊరేగించారు. స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయాన్నే స్వామివార్లకు తిరుచ్చి, శుద్ధి తోమాలసేవ, ఏకాంతసేవలు నిర్వహించారు. స్నపన తిరుమంజనం కావించి ఊంజల్ సేవ నిర్వహించారు. వాహన మండపంలో స్వామివారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామివార్లను హనుమంత వాహనంపై కొలువు దీర్చి గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు స్వాములు పాల్గొన్నారు.


ముత్యపు పందిరిపై స్వామివారి ఊరేగింపు

డ్వాక్రా నిధులు మాయం

– రూ.12లక్షలు స్వాహా చేసిన సంఘం లీడర్

మదనపల్లె : డ్వాక్రా సంఘానికి లీడర్‌గా వ్యవహరిస్తూ గ్రూప్‌కు సంబంధించిన నిధులు రూ.12లక్షలు స్వాహా చేసిందని గ్రూప్ సభ్యులు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీలో రాజరాజేశ్వరి డ్వాక్రా సంఘం ఉంది. అందులో 10మంది సభ్యులు ఉండగా, గ్రూప్‌లీడర్‌గా కే.రాధ వ్యవహరించేది. ఈ క్రమంలో సభ్యులు గ్రూప్‌కు సంబంధించిన డబ్బులు చెల్లించగా, వాటిని స్వప్రయోజనాలకు వాడుకుంది. మరో గ్రూపు సభ్యురాలు లక్ష్మీదేవి వద్ద ఉంచిన రూ.1లక్ష20వేలుతో కలిపి మొత్తంగా రూ.12లక్షలు స్వాహా చేసి ఉడాయించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు సంఘమిత్ర వాణి పూర్తి సహాయసహకారాలు అందించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అందుకున్న తాలూకా సీఐ కళావెంకటరమణ స్థానికంగా విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఫిర్యాదుచేసిన వారిలో గ్రూపు సభ్యులు పద్మ, నిర్మల, లలిత, లక్ష్మీదేవి, చంద్రకళ, రెడ్డిరాణి ఉన్నారు.

వేడినీళ్లు పడి చిన్నారికి గాయాలు

మదనపల్లె : వేడినీళ్ల మీద పడి చిన్నారి గాయపడిన సంఘటన కురబలకోట మండలంలో శుక్రవారం జరిగింది. సర్కార్‌తోపునకు చెందిన అస్రా అంజుమ్(3) ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు వేడినీళ్ల మీద పడవేసుకుంది. నీటివేడికి చిన్నారి తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషిచేయాలి

– ఉన్నతవిద్యామండలి అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మాధ్యూ

మదనపల్లె : రాష్ట్రంలోని అటానమస్ డిగ్రీ కళాశాలల్లో విద్యాప్రమాణాల పెంపుకు కృషి చేయాలని విజయవాడ ఉన్నత విద్యామండలి అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మాధ్యూ అన్నారు. పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో జరుగుతున్న రెండురోజుల వర్క్‌షాప్‌కు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో లివరేజింగ్ అటానమీ, బోర్డ్ ఆఫ్ స్టడీస్, అకడమిక్ కౌన్సిల్, గవర్నింగ్ బాడీ, ఫైనాన్స్ కమిటీల గురించి తెలియజేశారు. అటానమస్ కళాశాలకు ఇండస్ట్రీకి అనుగుణంగా సిలబస్‌ను మార్చుకునే వెసలుబాటు ఉందన్నారు. స్టాండర్స్‌ను ఎంచుకోవాలన్నారు. ఇది విద్యార్థికి ఎంతవరకు ఉపయోగపడుతుందనే అంశంపై శ్రద్ధ పెట్టాలన్నారు. స్కిల్ ఓరియంటెడ్ కోర్సులను పెట్టాలన్నారు. టీచింగ్ మెథడాలజీ, ఎవాల్యుయేషన్‌పై తెలియజేశారు. విద్యార్థికి పరీక్షలు జరిగిన తర్వాత ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఫలితాలను ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో మామిడి, అల్లనేరేడు తోటలు దగ్ధం

- బీడు పొలాల్లో నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు
- 12 ఎకరాల్లోని మామిడి, 45 అల్లనేరేడు చెట్లు దగ్ధం


మామిడి తోటలో మంటలు అంటుకున్న దృశ్యం

నిమ్మనపల్లె : గుర్తు తెలియని వ్యక్తులు బీడు పొలాల్లో నిప్పు పెట్టడంతో చెలరేగిన మంటలు భారీ అగ్ని ప్రమాదానికి కారణమయ్యాయి. పూత దశలోని మామిడి తోటలు, అల్ల నేరేడు చెట్లు, నీటి పైపులు, డ్రిప్పు పైపులు, కేబుల్ వైర్లు అగ్నికి ఆహుతై రైతులు తీవ్రంగా నష్టపోయారు. శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాద వివరాలు ఇలా..మండలంలోని బోడుమల్లయ్యగారి పల్లి సమీపంలో ఉన్న ఓబులేసుని కొండ వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు బీడు భూముల్లో నిప్పు అంటించారు. పెద్ద ఎత్తున మంటలు చెలరేగి చుట్టూ వ్యాపించాయి. రైతులు నరేంద్ర, ఖాసిం ఖాన్, భావాఖాన్, నిజాముద్దీన్ మంటలను గుర్తించారు. కొంతమంది రైతుల సాయంతో మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. ఓవైపు మంటల ఆర్పుతున్నా, మరోవైపు గాలి ప్రభావానికి వేగంగా మంటలు వ్యాప్తి చెంది,రైతుల శ్రమ వృథా అయింది. వాల్మీకిపురం ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారు. అగ్ని ప్రమాదంలో రైతు నరేంద్రకు చెందిన ఐదు ఎకరాల్లో మామిడి తోట, 45 అల నేరేడు చెట్లు నూరి మీటర్ల నీటి పైప్ లైన్, 100మీటర్ల కేబుల్ వైర్, మరో రైతు బావా ఖాన్ కు చెందిన పూత దశలో ఉన్న ఏడు ఎకరాల మామిడి తోట పూర్తిగా దెబ్బతింది. మొత్తంగా సుమారు 12 ఎకరాల్లోని మామిడి తోట, మామిడి తోటకు చుట్టూ వేసిన కంచె, మంటల్లో కాలిపోయింది. కంచె కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు దెబ్బతిన్నాయి. పూత దశలోని మామిడి చెట్లు అగ్ని ప్రమాదానికి గురై కాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సమాచారం అందుకున్న తహసిల్దార్ అమర్నాథ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదంలో నష్టం వివరాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని రెవిన్యూ అధికారులు తెలిపారు.

మహిళలు ఔన్నత్యాన్ని చాటాలి

- స్కిల్ సెట్‌తో సమస్యలను అధిగమించవచ్చు
- మహిళా దినోత్సవంలో జిల్లా ఎస్పీ విద్యా సాగర్ నాయుడు


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విద్యా సాగర్ నాయుడు

కురబలకోట : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమ ఔన్నత్యాన్ని చాటాలని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ర్యాలీని ప్రారంభించారు. అంతకు ముందు అక్కడి ఆడిటోరియంలో జరిగిన సభలో మాట్లాడుతూ సమాజంలో సమస్యలు సహజమని స్వశక్తి (సెల్ఫ్ కనెక్షన్), వృత్తి నైపుణ్యం ఉంటే ఎలాంటి ఒడుదుడుకులైనా ఎదుర్కోవచ్చన్నారు. విద్య, అక్షరాస్యతకు తేడా ఉందన్నారు. వృత్తిలో జీవితంలో రాణించాలంటే తల్లిదండ్రులు, గురువులు, అనుభవజ్ఞుల సూచనలు పాటించడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. మహిళలతో పాటు ఎవరికైనా సమస్య లేదా వేధింపులు ఉంటే పోలీస్ శాఖను సంప్రదించడానికి వెనుకాడవద్దన్నారు. ఇప్పటికే అన్నమయ్య జిల్లా వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు పోస్టు చేయడం జరుగుతోందన్నారు. త్వరలో భరోసా అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. డీఎస్పీ కొండయ్య నాయుడు, ట్రిపుల్ ఆర్ అకాడమీ ప్రెసిడెంట్ నాదేళ్ల ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫ్లాష్..ఫ్లాష్

ఆర్టీసీ బస్సును ఢీకొన్న పాల వ్యాన్

ఇద్దరు మృతి


ప్రమాదంలో మృతి చెందిన వారు


బోల్తాపడిన పాలవ్యాన్


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

కలకడ : రాయచోటి నుంచి చెన్నైకి వెళ్తున్న ఏపీ 04జడ్ 0384 బస్సును పీలేరు నుంచి రాయచోటి వైపు వస్తున్న పాల వ్యాన్ శుక్రవారం అర్ధరాత్రి ఢీకొంది. పాల వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. చిత్తూరు– కర్నూలు జాతీయరహదారిపై కేవీపల్లి మండలం మహల్ క్రాస్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కేవీపల్లి ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాలను పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వివాహితపై అత్యాచారం

- భర్తను చంపేస్తామని బెదిరించిన నిందితులు
- ఆలస్యంగా వెలుగులోకి.
- కేసు నమోదు చేసిన నిమ్మనపల్లె పోలీసులు

మదనపల్లె : సమాజంలో మహిళల ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఓవైపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకునే సందర్భంలో.... మహిళల భద్రతపై కూటమి ప్రభుత్వం వైఫల్యాలకు నిదర్శనంగా, సభ్య సమాజం తలదించుకునేలా ఓ వివాహితను బెదిరించి ఇద్దరు నిందితులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలంలో జరిగిన ఈ దారుణానికి సంబంధించిన వివరాలు బాధితురాలు తెలిపిన మేరకు.... నిమ్మనపల్లె మండలం, తవళం పంచాయతి నాయుని వారిపల్లికి చెందిన ఓ వివాహిత (26) గత నెల 28 వ తేదీన సాయంత్రం పాలు పోయడానికి సమీప గ్రామమైన నల్లంవారి పల్లికి కాలి నడకన వెళ్ళింది. తిరిగి ఇంటికి వస్తుండగా దారి కాచిన నల్లం వారిపల్లెకు చెందిన నాగేంద్ర, సురేంద్ర అనే ఇద్దరు యువకులు సదరు మహిళను చెట్ల పొదల్లోకి లాక్కునివెళ్లి ఒకరి తర్వాత ఒకరు బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం విషయం బయట పడకుండా ఆమెను చంపాలనే ఉద్దేశంతో ఒక బావిలోకి తోసే ప్రయత్నం చేయగా, నిందితులను బాధితురాలు ప్రాణాలు దక్కించుకుంది. అయితే అత్యాచార ఘటనకు సంబంధించి సమాచారం ఎవరికైనా చెబితే తనని, తన భర్తను చంపేస్తామని నిందితులు బెదిరించారు. దీంతో భయపడిన వివాహిత విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపకుండా మిన్నకుండిపోయింది. ఈ విషయమై తీవ్రంగా మధనపడుతూ పక్కింటి మహిళకు జరిగిన దారుణాన్ని వివరించింది. ఆమె కుటుంబ సభ్యులకు తెలపడంతో అత్యాచార ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిప్పేస్వామి గ్రామానికి చేరుకొని బాధితురాలిని విచారించి వైద్యపరీక్షల నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నింధితులపై అత్యాచారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒంటిమిట్టలో శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ


యాగశాలలో మంత్రోచ్ఛారణ చేస్తున్న వేదపండితులు


రామాయణ నాట్య ప్రదర్శన చేస్తున్న నాట్య కళాకారులు


రామయ్య క్షేత్రాల కోలాట బృందాలు కోలాహలం

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో టీటీడీ పాంచరాత్ర ఆగమన సలహాదారు రాజేష్ కుమార్ వేదపండితుల బృందం మహా సంప్రోక్షణ మహోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రెండవరోజు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి భగవత్పుణ్యాహము, చతుస్థానార్చనము, సహస్ర కలశవాహన, రామ తారక హోమం , శ్రీమద్రామాయణ హోమం, పవమాన, పంచ సూక్త హోమములు, విమాన గోపుర ఛాయ స్నాపణము, పరివార హోమం, పూర్ణాహుతి నివేదన, బలి, నీరాజనము, సాత్తుమొర చేయగా సాయంత్రం 5.30 గంటల నుండి సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, చతుస్థానార్చనము, మూర్తి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

అలరించిన రామాయణ నాట్య ప్రదర్శన :
ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి పుణ్యక్షేత్రంలో మహా సంప్రోక్షణ మహోత్సవాలలో బాగంగా రెండవరోజు శుక్రవారం రామాయణ నాటి ప్రదర్శన అందరినీ అలరించింది. తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర నాట్య కళాబృందం చేత వారికి స్వయంగా టీటీడీ పంచరాత్ర ఆగమన సలహాదారు రాజేష్ కుమార్ అభినందనలు తెలిపి, ఊంజల్ సేవలో ఉన్న ఉత్సవ మూర్తులకు హారతులు ఇచ్చారు. ఒక నాట్య ప్రదర్శనే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోలాట బృందాలు కూడా భక్తులను అలరించాయి. కార్యక్రమలో అర్చకులు శ్రావణ్ కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.